
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

## వీక్నెస్

" మిస్టర్ ప్రీతమ్! బెంగుళూరులో ఖాళీ ఉంది, అక్కడ హెడ్ ప్రకాష్ గారికి మీ అవసరం ఉందిట, అందుకే మిమ్మల్ని అక్కడికి ట్రాన్స్ఫర్ చెయ్యమని నాకు అభ్యర్థన రాశారు. ఎలాగూ మీ వైఫ్ అక్కడే ఉన్నారు కదా, అందుకని నేను మీలాంటి సమర్థుల అవసరం అక్కడ ఉంది కనక తప్పకుండా చెయ్యమని రికమెండేషన్ రాశాను. ఈజీ గా అయిపోతుంది, ఢిల్లీ నుంచి రాష్ట్ర రాజధానులకి వెళ్ళడానికి ఎక్కువమంది ఉండరు కదా. మిమ్మల్ని మీరు నిరూపించుకోవడానికిదో మంచి అవకాశం..

మీ వైఫ్ జూహీ కి ఇక్కడకి పోస్టింగ్ దొరకడం కష్టమవుతోందిట కదా. ఇలా అయితే మీకు సమస్య ఉండదు కదా! అని. మీరు త్వరలోనే అక్కడ జాయిన్ అయ్యే ప్రయత్నాలు చేసుకోవచ్చు. గుడ్ లక్ " అంది సంఘమిత్ర భరద్వాజ్.. తన గ్రూప్ లో పనిచేస్తున్న ప్రీతం అనే ఉద్యోగితో..

" కానీ మేడమ్! నేను ఇక్కడే ఉండాలని అనుకుంటున్నాను, నేనసలు ట్రాన్స్ఫర్ కి అడగలేదు కూడా. మేమంతా ఇక్కడివాళ్ళమే, మా నాన్నగారువాళ్ళంతా ఎప్పుడో హర్యానా నించి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయారు. ఇప్పటికీ మా తాతగారు వాళ్ళు మా స్వగ్రామం లోనే ఉన్నారు. అందుకనే" అంటూ ఆవిడ వైపు చూసినవాడు ఆ కళ్ళల్లో కనిపించీ కనిపించనట్టున్న తీవ్రతకి ఆగిపోయాడు.

చెప్పాను కదా, ప్రకాష్ కోరి అడిగారు మిమ్మల్ని. కొన్నాళ్ళుండి మళ్ళీ వచ్చేద్దురుగాని. కొత్త ప్రదేశాలు కొత్త అవకాశాలు తేవచ్చు కూడా..

" నిన్న మనం మాట్లాడిన ఫైల్ వర్క్ మీరు పూర్తి చేస్తే సంతకాలు చేస్తాను, నాకో ముఖ్యమైన మీటింగ్ ఉంది మరో రెండు గంటల్లో" అందావిడ మరో మాటకి తావు లేనట్టు.

ఏం చెయ్యాలో తెలీనట్టు గా సన్నగా భుజాలెగరేస్తూ లేచాడు ప్రీతమ్.

-------------------

సంఘమిత్ర భరద్వాజ్..

1989 బేచ్ ఐ.యే.ఎస్ ఆఫీసర్.

ఎంత హుందాగా, అందంగా ఉంటుందో అంత నిక్కచ్చి మనిషి.

ఇన్నేళ్ళ ఆవిడ సర్వీస్ లో ఒక్క క్షణం ఆలస్యంగా రావడం అనేది ఎరుగనంత క్రమశిక్షణా, దీక్షా, పట్టుదలా ఆమె స్వంతం.

ఎంత కష్టమైన బాధ్యతనైనా మొదలు పెడితే ముగించేదాకా వదలదు, తిరిగిచూడదు. ఆఫీస్ వేళల్లో పని తప్ప మరో మాట ఎక్కువ మాట్లాడదు.ఎలాంటి పరిస్థితులనైనా తొణక్కుండా, బెణక్కుండా ఎదుర్కోగల ధీర గంభీర ఆమె.

ఆవిడ విధి విధానాలు ఎంత పేరు ప్రఖ్యాతులు తెచ్చాయో, అంతలా విమర్శలూ తెచ్చాయి. ముఖ్యంగా ఆమెతో సమానంగా పనిచేయలేని వారిదగ్గరనించీ, ఆమె దగ్గర పని చేసేవారిదగ్గరనించీ..

' లేడీ హిట్లర్ ', ' చండశాసనురాలు ', కొరకరాని కొయ్య ' లాంటి బిరుదులెన్నో ఆవిడకి ఆమె క్రింది ఉద్యోగులనించి ఆలవోకగా లభించాయి, లభిస్తూనే ఉన్నాయి..

దేన్నీ పట్టించుకోదు ఆమె.

తన పనేదో, తనలోకమేదో.. అంతే.

" లీవ్ అనేది గవర్నమెంట్ మనకిచ్చిన సౌకర్యం, హక్కు కాదు. దాన్ని బాధ్యతగా వాడుకోవాలని నేను మీకు చెప్పక్కరలేదు. పర్మిషన్ అనేది తోటి వారి పట్ల సానుభూతితోనూ, మానవత్వంతోనూ ఇచ్చేది.. దానికో మితి ఉంటుంది. మీకు నిజంగా అవసరం అయితే లీవ్ అన్న సౌకర్యాన్ని వాడుకోండి. అంతే కాని నెలకిన్ని సార్లు పర్మిషన్ పేరిట సగం రోజు పని చెయ్యనంటే ఇవ్వడానికి వీలు కాదు" అని ఖచ్చితంగా చెప్పినప్పుడు వాళ్ళు ఆమె గ్రూప్ లో స్త్రీ ఉద్యోగులు..అనుకునే మాటలు

" ఈవిడకి పెళ్ళీ పెటాకులూ లేవు కదా, అందుకే అందరినీ వేపుకు తింటుంది" అని.

ఇలాంటివామెకు కొత్త కాదు, విన్నా విననట్లే ఉంటుంది. ఆవిడకి కావలసినదల్లా సరి అయిన సమయానికి పని సక్రమంగా జరగడం. అంతే..

ఆవిడ తనకు గవర్నమేంట్ ఇచ్చిన వసతిలో తల్లితో పాటు ఉంటుంది. ఆవిడ అన్న కూడా దగ్గరలోనే ఉంటారు, ఆయనకిద్దరు ఆడపిల్లలు.. వదిన ఉద్యోగరీత్యా వాళ్ళిద్దరినీ చాలా రోజులపాటు తల్లే దగ్గరుండి చూసుకునేది.

కవలపిల్లలైన వాళ్ళిద్దరంటే ఆ నలుగురికీ పంచప్రాణాలు.

సంఘమిత్ర కి మరీ. వారాంతాల్లోనూ, శలవు రోజుల్లోనూ వారిద్దరే లోకంగా ఉంటుందావిడ.

వాళ్ళిద్దరే మేడం 'వీక్ నెస్'.. అని ఆమె సహోద్యోగులు తరచూ అనుకుంటూ ఉంటారు..

" ఆవిడెందుకు పెళ్ళి చేసుకోలేదో?" అంటూ కొందరూ

"లేకపోతే చక్కని తెలివైన పిల్లలు తనకూ ఉండేవారు కదా! ఎంత అన్న పిల్లలైనా స్వంత వాళ్ళు కాదుగా" అంటూ మరికొందరూ ఇలా తోచీ తోచని వ్యాఖ్యలు చాలానే చేసుకుంటూ ఉంటారు పక్కవారి జీవతాన్నెంచడం తప్ప మరో పనిలేనివాళ్ళందరూ.

--------------

ఆవిడ మీటింగుకెళ్ళేవరకూ నిగ్రహించుకున్న ప్రీతమ్ వెంటనే లేచి పక్క సెక్షన్ లో ఉన్న తన స్నేహితుడిదగ్గరకెళ్ళి గబ గబా విషయమంతా చెప్పాడు..

వాళ్ళిద్దరికీ అసలు విషయమేమీ అర్ధం అవలేదు.

" జూహీ ని వచ్చేయమని నేను చెప్తూ ఉంటే ఇంతలో ఇదేమిటి?" అన్నాడు ప్రీతమ్.

"అదే నాకూ తెలీడం లేదు.. జూహీ ఎవరికైనా చెప్పిందంటావా?" అనడిగాడు స్నేహితుడు.

" ఛాన్సే లేదు. ఆమెకెవరూ తెలీదు. తనూ, తన సివిల్స్ కోచింగ్ తప్ప మరో ప్రపంచం తెలీదు, వాళ్ళ ఇంట్లో కూడా ఎవరూ గవర్నమెంట్ లోనే లేరు. అంతా డాక్టర్లూ, ప్రొఫెసర్లూ.

అదీ కాక తననే వదిలేసి వచ్చేయమంటున్నాను, దానికీ ఒప్పుకుంది. ఇంతలో ఈవిడ ఇలా బాంబు పేల్చింది" అన్నాడు ప్రీతమ్.

సంఘమిత్ర వచ్చేటైమవుతుంటే మళ్ళీ తన సీటుదగ్గరకి పరిగెత్తాడు ప్రీతమ్.

---

ఆ రోజుకు పని ముగించుకుని కార్ లో కూర్చున్న సంఘమిత్ర సీటులో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది..

" మిత్రా!" పక్కనే కూర్చున్నట్టు పిలుపు..

" సుధా" ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.. భ్రమే.. మళ్ళీ.. సుధాంశు పక్కనే ఉన్నట్టు.. తనతోనే మాట్లాడుతున్నట్టు..

ఎన్నాళ్ళైంది? పదేళ్ళు, పదిహేను?

లెక్క గుర్తుందా? మర్చిపోతుందా? క్షణాలతో సహా లెక్కే కదా.

కాలేజీ నాటి స్నేహం..

కోచింగ్ రోజులనాటి సాన్నిహిత్యం..

ట్రెయినింగ్ నాటికి ప్రణయమైంది..

విడదీయలేని బంధమైంది..

ఒకరి అభిప్రాయలని మరొకరు, ఒకరినొకరు, అర్ధం చేసుకున్నారు.. గౌరవించుకున్నారు..

గంటలు క్షణాల్లా గడిచే కబుర్లు, కలిసిన అభిరుచులు..

ఎంతో పరిణతి గలదనుకున్న తమ ప్రణయం కూడా పరిణయమనుకున్నవేళ చాలా మామూలు కారణాలకే ఓడిపోగలదన్న విషయం తెలిసిన నాడు సంఘమిత్ర కి తగిలిన ఎదురుదెబ్బ మామూలుది కాదు..

" ఐ. ఏ.ఎస్ అవడం నా ఆశ.. జిల్లా కలక్టర్ అవ్వాలన్నది నన్ను నిద్రపోనివ్వని నా కల. ఆవిషయం నాకంటే నీకే ఎక్కువ తెలుసు. అది తెచ్చే బాధ్యతలూ, బాధలూ ఎలాంటివో మనకిద్దరికీ తెలుసు.. ఆ కలని, దేనికోసమూ నేను చేజార్చుకోలేను.. మరొకదాన్ని ఎంచుకోవడం అసాధ్యం"

ఇద్దరూ ఐ.ఏ ఎస్ ఆఫీసర్లైతే ఒకే చోట ఉండగలిగే అవకాశాలు తక్కువ కనక ఆమె ఐ.ఆర్. ఎస్ లాంటిదేదైనా ఎన్నుకుంటే బావుంటుందని, ఇద్దరూ ఒకదగ్గర ఉండడానికి మార్గంగా సుధాంశు మొదటిసారి సలహా చెప్పబోయినప్పుడు సంఘమిత్ర చెప్పిన మాటలివి.

" మిత్రా, నాకు తెలుసు, అది మనిద్దరి కల అని"కానీ, మన పెళ్ళి అయితే ఇద్దరూ ఒకదగ్గర ఉండడం కూడా ముఖ్యమే కదా" అన్నాడు సుధాంశు..

" గవర్నమెంట్ లో విధి విధానాలు నాకు కూడా తెలుసు, కష్టమే కానీ అసంభవం కాదు. ఐనా ప్రపంచంలో ఉద్యోగాలు చేసే భార్యాభర్తలంతా అన్ని రోజులూ ఒకేచోట కలిసి ఉంటున్నారా? మనమూ అంతే" అన్నది ఆమె వాదన.

" అలాంటి వైవాహిక జీవితాన్ని కాదు నేను కలలు కన్నది. నాకో చిన్న ఆహ్లాదకరమైన ఇల్లు, నాకోసం ఎదురుచూసే మనుషులూ, నావాళ్ళనుకునే పిల్లలూ" ఇలాంటి జీవితం నా ఊహా ప్రపంచంలో ఉన్నది.. అతని సమర్ధన..

" మనుషులందరికీ నువ్వన్న జీవితం కావాలి సుధా.. కానీ కొన్ని సార్లు సర్దుకోవాలి కదా.. అన్ని రోజులు ఒకేలా ఉండవు కదా" ఆమె సమాధానం

" అలాంటి పరిస్థితి తెచ్చుకోవడం ఎందుకు, నేను చెప్పిన మాట వింటే సమస్యే లేదుగా" అతని జవాబు..

" అసలు సమస్య అనుకుంటేనేగా ఉండేది?" ఆమె ప్రశ్న..

తెగని వాదన ఎడతెగని సమస్య అయింది.

ఇద్దరి మధ్యనుంచి రెండు కుటుంబాలదాకా వెళ్ళింది.. ఎవరూ తగ్గనప్పుడు తెగడం తప్ప మరో మార్గం లేకపోయింది..

ఎవరి కలని వాళ్ళు సాకారం చేసుకునే ప్రయత్నంలో కలిసి కన్న కలలు కనుమరుగయ్యాయి..

అలా సుధాంశు దూరమయిన తర్వాత మిత్ర మరో వ్యక్తిని దగ్గరకు రానివ్వలేదు. మరో సారి భంగపడి సేదతీరేంత శక్తి తనకు లేదని అనుకుందామె.

" నువ్వు మొండి దానివి" అని అతను

" నువ్వూ ఫక్తు మామూలు మగాడివి" అని ఆమె

ఎప్పుడూ ఒకరినొకరు నిందించుకోలేదు..

కలవని తమ అభిప్రాయాలు తమని కలిసి ఉంచలేవు అనుకున్నప్పుడు విడిపోవడమే మంచిదనుకున్నారు.

స్నేహితులుగా అప్పుడప్పుడు కలుస్తూనే ఉంటారు..

సుధాంశు పెళ్ళి కి వెళ్ళి , ఇద్దరికీ అభినందనలు చెప్పి వచ్చింది...

ఈ రోజుకీ తను చేసినదే సరి అయిన పని అని ఆమె నమ్ముతుంది.

'కానీ ఇలాంటి నిర్ణయాలు ఆడపిల్లలే చేసుకోవల్సి వస్తుందా?' అని ఆలోచించినప్పుడల్లా ఆమెకు బాధగా ఉంటుంది.

' నీకోసం నేను చెయ్యనా ఆ పని? ఆరోజు సుధాంశు అనలేదు. ఈరోజైనా ఎవరైనా అంటారా?' అనుకుంటుంది..

' అప్పటికీ ఇప్పటికీ రోజులు మారాయి, మనుషులు మారారు, వారి దృక్పధాలు మారుతున్నాయి. యువత మనకంటే అన్నింటిలోనూ మెరుగ్గా ఉన్నారు, స్వతంత్రంగా ఆలోచిస్తున్నారు, ముఖ్యంగా అమ్మాయిలు..' అని అంతలోనే ముచ్చట పడుతుంది.

తన అన్న కూతుళ్ళని చూస్తే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుందిమిత్రకి. నిన్న మొన్న కళ్ళు తెరిచిన పాపలు నేడు తన భుజాలు దాటి ఎదిగి, తొణికిసలాడే ఆత్మవిశ్వాసంతో చక్కగా ఉండడం ఆమెకెంతో ఆనందంగా ఉంటుంది..

అలాగే ఉంది, నాలుగురోజుల క్రితం వచ్చిన ఫోన్ కాల్ మాట్లాడేవరకూ..

----------------

స్త్రీల సమస్యలు తెలియనిది కాదు. ప్రపంచవ్యాప్తంగా ఏం జరుగుతోందో అవగాహన ఉన్న మహిళ తను..

మహిళా సాధికారత కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి, ఉద్యోగరీత్యా, వ్యక్తిగతంగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యక్తి..

ఆధునికత వైపు సమాజం అడుగులు వేస్తోంది అనుకుంటున్న ఆఫీసర్, ఆ ఫోన్ కాల్ విని ఆశ్చర్యపోయింది..

'అత్యవసరంగా మీతో మాట్లాడాలని ఒకమ్మాయి ఫోన్ చేసింది" అని సెక్రటరీ చెప్పగానే కాస్త తీరిక ఉండడంతో కనెక్ట్ చెయ్యమంది.

" మేమ్! నా పేరు రూహీ..ముందుగా మీరు నన్ను క్షమించాలి, ఇలా ముందు చెప్పకుండా ఫోన్ చెయ్యడం నా తప్పు. కానీ విషయం అలాంటిది. మీ సహాయం కోరి ఈ ఫోన్ చేస్తున్నాను మేడం.. మీ విభాగంలో పనిచే స్తున్న ప్రీతమ్ నాకు మరిది అవుతారు. నా చెల్లెలు జూహీ భర్త. " అంది ఆ అమ్మాయి..

కంపిస్తున్న గొంతులో ధ్వనిస్తున్న భయం.

" ఓ, హలో! ఏదైనా పర్సనల్ విషయమా? అయితే ఆఫీస్ లో వద్దు, ఇంటి దగ్గర మాట్లడదాం. ఆఫీస్ లో వ్యక్తిగత విషయాలు మాట్లాడడం నాకు నచ్చదు" అంది మిత్ర..

" ఎలా చెప్పాలో తెలీడం లేదు మేమ్! పర్సనల్ అంటే కాదు.. జూహీ ని ఉద్యోగం వదిలెయ్యమని ఒత్తిడి చేస్తున్నారు ప్రీతమ్, ఆ విషయమే మీకు చెప్పాలని" అంది..

" అది వాళ్ళ స్వవిషయం కదా" అంది మిత్ర..

"కాదు మేమ్!" అంటూ ఏదో చెప్పబోతున్న రూహికి తనను కలవమని చెప్పింది.

ఆ తర్వాత రూహీ ఒక సాయంత్రం మిత్ర సూచన మేరకు ఆమెని కలిసింది..

ఆమె చెప్పిన విషయాలు విన్న మిత్రకి తగని ఆవేశం, ఆవేదన కలిగాయి..

" అవును మేమ్. నా చెల్లెలని చెప్పడం కాదు కానీ జూహీ మొదట్నుంచీ టాపర్. ప్లస్ టూ లో ఆల్ ఇండియా రాంక్ వచ్చిన అమ్మాయి. నేను అప్పటికే మెడిసిన్ చదువుతున్నాను, నాన్నకేమో తనని ఇంజనియర్ చెయ్యాలని కోరిక.. నాన్న మాట మేరకు మంచి కాలేజ్ లో చేసింది, ఆ తర్వాత టెక్నాలజీ ఉద్యోగం కాక గవర్నమెంట్ ఉద్యోగం చేస్తానని, సివిల్స్ కి చదువుతానని చెప్పింది.

హాయిగా సాఫ్ట్ వేర్ ఉద్యోగం లో చేరమన్నప్పుడు కాదంది.

ఆశయం మంచిదే, కానీ చాలా సమయం కావాలి కదా, ఎన్నేళ్ళు పడుతుందో తెలీదు నాన్న హెచ్చరించారు.

అయినా పట్టు పట్టింది..

గవర్నమెంట్ జాబ్ తెచ్చుకున్నాకా చదువుకుంటానని ముందే చెప్పింది..

అనుకున్నట్టే ఉద్యోగం సంపాదించుకుంది. తనకి మొదటినించీ సంఘ సేవ అంటే చాలా మక్కువ, రెండు సంస్థలలో వాలంటీర్ గా పనిచేస్తుంది..

మూడేళ్ళ క్రితం నా పెళ్ళిలో ప్రీతమ్ అమ్మా, నాన్నా వెంటనే మా అమ్మా, నాన్నలని అడిగారు జూహీని ప్రీతమ్ కోసం..

నిజానికి జూహి కి అప్పుడే పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు, తన చదువుకి అడ్డం అవుతుందని.

తెలిసినవాళ్ళు, ఇద్దరిదీ గవర్నమెంట్ ఉద్యోగం.. హాయిగా ఉంటారని అమ్మా, నాన్నల ఆలోచన. ఎవరిదీ తప్పు కాదు..

నాలుగైదునెలలూ నలుగురం ( నాతో సహా) చెప్పబట్టి ఒప్పుకుంది. ఏడాదిన్నరయింది వాళ్ళ పెళ్ళి అయి..

ఆమె బదిలీ కోసం ప్రయత్నించింది, కానీ కుదరలేదు.. మొదట్లో ఇద్దరూ ఒకరిదగ్గరొకకరు వెళ్ళడం, సరదాగా గడిచింది..

ఆ తర్వాత మొదలైంది..

'అమ్మా, నాన్న పెద్దవాళ్ళయిపోతున్నారు. ఉమ్మడికుటుంబంలో బాధ్యతలు నీకు తెలీనివి కాదు, వదినలెన్నాళ్ళు చేస్తారు?'

'నీకు పెళ్ళయినా మేమే వండి పెట్టాలా? మీ అమ్మా నాన్నలకి సేవ ఎన్నేళ్ళయినా మేమేనా?' అంటున్నారు. ఇలా మొదలై న ప్రీతమ్ గొణుగుడు సతాయింపు గా మారడానికి ఎక్కువ రోజులు పట్టలేదు..

' కోడలెప్పుడూ మీదగ్గరకు రాదా? అని ఇరుగుపొరుగు వాళ్ళు అడుగుతుంటే ఏం చెప్పాలి?' అని వాళ్ళ అత్తగారు, తోడికోడళ్ళు..

'ట్రాన్స్ ఫర్ అయితే అయింది, లేదంటే వదిలేసి వచ్చెయ్యి. కుటుంబం కంటే ఎక్కువేదీ కాదు. అంతగా కావలస్తే ఇక్కడేదైనా చిన్న ఉద్యోగం చూసుకోవచ్చు' ప్రీతమ్ ఉచిత సలహాలు..

'నువ్వు హాయిగా బెంగుళూరు లో టింగురంగా మని ఒక్కాదానివి ఉంటున్నావు, ఇక్కడ మాకెన్ని బాధ్యతలో, పిల్లలూ, ఇంటిపనీ.. కొత్త తోడికోడలు వచ్చి పంచుకుంటుందనుకున్నాము' ఇలా రోజుకోరకమైన మెత్తని వేధింపులు..

ఇవన్నీ స్వతహాగా సున్నిత మన్సకురాలైన జూహిని బాగా బాధపెడ్తున్నాయి..

దానికి తోడు అమ్మా కూడా..

'మన కుటుంబం పరువు నిలబెట్టు తల్లీ, మీ అత్తగారు వాళ్ళు ఏది అంటే అది చెయ్యి. అయినా భార్య భర్తా కలిసి ఉండాలి కదా, లేదంటే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు' అంటూ వాళ్ళు పోసే ఆజ్యం వాళ్ళు.

లాంగ్ లీవ్ పెట్టి చూడమని సలహా ఇచ్చాను, అదీ చేసింది కొన్నాళ్ళు. ఆ రెండు నెలలూ ఇక్కడ ఉందన్న ఆనందం తప్ప ఒక్కొక్కటిగా దూరమవుతున్న ఆమె ఆనందాలు చూసి నేనే వెళ్ళిపొమ్మన్నాను మేమ్.

సివిల్స్ మొదటి పరీక్ష పాసయింది, మెయిన్స్ కి ఎంత శ్రద్ధగా ప్రిపేర్ అవ్వాలో మీకు తెలియనిది కాదు..

ఇక్కడ అది కొనసాగే అవకాశమేదీ కనిపించలేదు నాకు..

ఇంట్లో ఎప్పుడూ ఏదో హడావిడీ, వచ్చేవారూ, పోయేవారు. కనిపించకుండానే కష్టపెట్టే నిష్టూరాలు, గీతగీయని ఆంక్షలూ,అందరికంటే చిన్నదవడం వల్ల మరీ..

చూసి తట్టుకోలేకపోయాను.

అతనికి లేని ఆశ నా చెల్లెలికి ఉండడం తన తప్పా?

అతనికి ఉన్న ఉద్యోగం చాలు, రోజూ సాయంత్రం హాయిగా భార్య వండి పెడితే తిని, సినిమా పాటల ప్రోగ్రాములో, మరోటో అన్నదమ్ములతో కలిసి నవ్వుకుంటూ అర్ధరాత్రి దాకా చూసి, పొద్దున్నే నిద్రలేచేసరికి అన్నీ తయరుగా ఉంటే తిని ఆఫీసుకెళ్ళడం ఊరికి ఉపకారంలా భావించే మనస్తత్వం అతనిది.

ఎవరిష్టం వారిది, నా ఉద్దేశ్యం అతన్ని తప్పు పట్టడం కాదు..

ఉమ్మడి కుటుంబంలో చిన్నవాడు కనక కష్టం, ఇంకా చెప్పాలంటే బాధ్యత తెలీకుండా పెరిగాడు. ఇంట్లో నెలసరుకులు ఎవరు తెస్తారు? ఇల్లెవరు శుభ్రం చేస్తారు? ఎవరు వండుతారు? ఆడవాళ్ళెప్పుడైనా విశ్రాంతి తీసుకుంటారా? లాంటి విషయాలతో ఎప్పుడూ అవసరం రాలేదు అతనికి..

అన్నింటికంటే ముఖ్యం.. జూహీ మెయిన్స్ కి చదవడం మొదలుపెట్టడం, అన్ని కలిసి వస్తే భార్య తనకన్నా ఎత్తుకి వెళ్ళిపోతుంది అన్న ఆలోచనే అతనికి అభ్యంతరమేమో అనిపిస్తుంది నాకు.

'ఏదో పెళ్ళి టైములో అన్నావనుకున్నాను కానీ, నిజంగానే రాత్రీ, పగలూ పడి చదువుతావనుకోలేదు' అని అత్తగారంటే సహించింది..

తనకంటే భార్య పై మెట్టుకెదుగుతుందంటే అతను చూపించిన అసహనం ఆమె భరించలేకపోయింది. దానికి పెళ్ళి, పిల్లలు, సంసారం లాంటి సాకులు చెప్తే తన మనసు గాయపడింది..

ఇంత బాధపడి, అందరినీ బాధపెట్టి బావుకునేదేముందని ' దీదీ ఒన్స్ ఫర్ ఆల్ ' రాజీనామా ఇచ్చేస్తాను' అని ఫోన్ లో ఏడ్చినప్పుడు తన మనసెంత మధనపడిందో నాకే తెలుసు..

రోజూ నాలుగు సార్లు మాట్లాడి డిప్రెషన్ అంచులకి చేరిన నా చెల్లిని రక్షించుకున్నాను మేమ్.

ఏమిటి తను చేసిన తప్పు? "రూహీ కళ్ళనిండా నీళ్ళు..

"ఏం మారింది మేమ్? వేసుకునే బట్టల్లోనూ, మాట్లాడే భాషలోనూ వచ్చిన నూతనత్వం భావాల్లో రాదెందుకు? "

చేతిలో ఉన్న పేపర్ నేప్కిన్ తో కళ్ళు తుడుచుకుంటూ ఆగిపోయింది రూహి..

" మీ గురించి జూహి కి తెలుసు మేమ్. కేవలం తన భర్త బాస్ గానే కాదు, ఒక సమర్ధవంతమైన అధికారిణిగా. తనతో సహా ఎంతో మందికి ఆదర్శప్రాయమైన అధికారిగా. మీరు ఇంతకు ముందు స్త్రీల సంక్షేమ శాఖలో పనిచేసినప్పటి విషయాలు, మీ ఆశయాలు తెలిసి మీరేదైనా చేస్తారేమో అన్న ఆశతో మీ దగ్గరకొచ్చాను. నేను మిమ్మల్ని కలుస్తున్నట్టు జూహికి కూడా తెలీదు.. ప్లీజ్ దూ సంథింగ్ మేమ్. " అంది రూహి అభ్యర్ధనగా..

ఆమె చెయ్యి మెత్తగా నొక్కింది మిత్ర..

"కామ్ డవున్ ప్లీజ్." అంది మార్దవంగా..

--------------

ఆ తర్వాత త్వరగా ఆలోచించి చక చకా పావులు కదిపింది. అనుకోకుండా అక్కడ ప్రీతమ్ కి తగ్గ అవకాశం ఉండడం, తన స్నేహితుడు ప్రకాష్ అక్కడ అధికారి కావడం కలిసి వచ్చింది..

'ఏ జంటనైనా కలపడానికే ప్రయత్నించాలి' , ఎవరి ఒత్తిడీ లేని తమదైన ఏకాంతలో ఉంటే పరిస్థితులు మారవచ్చని అనుకుంది..

సమర్ధురాలైనన అమ్మయి ఉద్యోగ జీవితమూ, ఆశయాలు నిలబడతాయనీ, అది కుదరకపోతే అప్పుడే చూడవచ్చనీ అనుకుంది.

అందుకే ప్రీతమ్ ని అడగకుండానే ప్రకాష్కి అతని లాంటి వ్యక్తి కావాలి కనక, అతని భార్య ఎటూ అక్కడే ఉంది కనక ఈ ట్రాన్స్ఫర్ జరిపించమని ఉత్తరం రాసింది..

అది తప్పకుండా జరిగి తీరుతుందని ఆమెకి తెలుసు.. ఇలాగైనా జూహి కి మేలు జరిగితే చాలు అనుకుంటూ ఉండగానే కార్ ఇల్లు చేరింది.

కార్ దిగి లోపలకి వస్తుంటే మేనకోడ ళ్ళు చూస్తున్న టీ వీ కార్యక్రమం మధ్య లో ' వై షుడ్ బాయ్స్ హావ్ ఆల్ ది ఫన్' అంటోంది ప్రకటన..

అప్రయత్నంగానే చిరునవ్వొచ్చి చేరిందామె ముఖాన

ఆమెని చూసి 'అత్తా!' అంటూ ఎదురొచ్చిన ఇద్దర్నీ ప్రేమగా కౌగలించుకుంది సంఘమిత్ర.

వీళ్లైతే ఏ ఆడపిల్లా ఏ విషయంలోనూ బాధ పడకుండా చెయ్యాలన్నదే ఆశ.. ఆడపిల్లలంటే అంత ప్రేమ, అభిమానం.. అదే తనకున్న 'వీక్ నెస్' ఏమో అందరూ అనుకున్నట్టు కేవలం మేనకోడళ్ళే కాదు..

●●●

Click here to share your comments on this story